త్రిపురారంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, పక్కన ఎమ్మెల్సీ కోటిరెడ్డి

ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి

- కాంగ్రెస్ మాయమాటలు, ప్రలోభాలకు లొంగొద్దు
- ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీఎమ్మెల్యే భగత్

త్రిపురారం, ఏప్రిల్ 21 : పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని, గ్రామగ్రామాన బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధిని వివరించాలని ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి అన్నారు. త్రిపురారం మండల కేంద్రంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్‌తో కలిసి నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, ఓటర్లంతా కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే భగత్ మాట్లాడుతూ కాంగ్రెస్ చెప్పే మాయమాటలకు లొంగవద్దని, ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన ఆ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించడానికి కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిడమనూరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కామెర్ల జానయ్య, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి వెంకటాచారి, మడుపు వెంకటేశ్వర్లు, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గుండెబోయిన వెంకన్నయాదవ్, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, చిమట మట్టయ్య, కలకొండ వెంకటేశ్వర్లు, పెద్ద వెంకటయ్య పాల్గొన్నారు.

29 నుంచి సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

నకిరేకల్ : వార్షికోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, ఏప్రిల్ 21 : ఈ నెల 29,30 తేదీల్లో పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిర 17వ వార్షికోత్సవం, జ్ఞాన సరస్వతీ దేవి ఆలయ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ వనమా వెంకటేశ్వర్లు తెలిపారు. ఉత్సవాల కరపత్రాన్ని ఆదివారం పట్టణంలోని పన్నాలగూడెం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వేముల వీరేశం చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గాజుల సుకన్య, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి ఉప్పల వెంకటరమణ, సహాయ కార్యదర్శి బానాల రాంరెడ్డి, వలిశెట్టి స్వప్న, తౌను పునూరి రాంబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు నోముల గోవిందరాజులు, బండారు వేణుగోపాల్, వీరవెల్లి హరినాథ్, కూరెళ్ల శ్రీనివాస్, పిల్లలమర్రి సునీత, దాచేపల్లి శ్రీనివాస్, దేవరశెట్టి మధుసూదన్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

గురుకులంలో సీట్లు సాధించిన విద్యార్థులకు అభినందనలు

గురుకులంలో సీట్లు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 21: మండలంలోని శిల్గాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలకు చెందిన 22 మంది విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబర్చి వివిధ గురుకులాల్లో సీట్లు సాధించారు. ఆదివారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో సీట్లు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కట్టెబోయిన సైదయ్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు 15 మందికి తగ్గకుండా గురుకులాల్లో సీట్లు సాధిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది 25 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 22 మంది సర్వేల్, నాగార్జునసాగర్, గంధంవారిగూడెం గురుకులాల్లో సీట్లు సాధించినట్లు తెలిపారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివప్రసాద్, ఎరనాగుల సైదులు, శిరీష, కల్పన, వసంత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ వీరమ్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

NCL HIGH SCHOOL & JUNIOR COLLEGE
(C/o. NCL Industries Limited - Nagarjuna Cement)
Simhapuri, Mattampally Mandal, Suryapet District – 508204
WALK-IN INTERVIEW
Teachers for **Social Studies (High School), E.V.S (Primary), Hindi (Middle School) English (Middle & High School), Physical Science (High School) Mother Teacher, P.E.TS – B.Ed Graduates** in relevant subjects having minimum of 2 years' experience in a reputed School.
Candidates meeting the above criteria may **walk-in** for an interview, with their testimonials between **8.30 am and 5.00 pm on 24th & 25th April 2024 (Wednesday & Thursday)** at **NCL HIGH SCHOOL & JUNIOR COLLEGE** Simhapuri, Mattapalli Village Mattampally Mandal, and Suryapet District – 508204.
Contact No: +91 9490436818 or +91 7997991494.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

LOST
I am Mididoddi Kanakamma D/o. Mididoddi Bixamaiah, R/o. H.No.1-106, Mothkur, Mothkur (M), Yadadri, TS., On 02-04-2024 I've Lost My Class X Pass Certificate issued by SSC Board in the year of 2009. My School name is ZPHS Ammanabole and Roll No.1026203050. If any body found. Cont:8106797730.

WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్. 6K. Ph: 9640258899, 9640468899.
NT-311831-AI

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | చౌటుప్పల్ : 9182777636

పలు మండలాల్లో గాలి వాన

- అకాల వర్షంతో తడిసిన ధాన్యం
- ఈదురు గాలులకు నేలకొరిగిన చెట్లు, విద్యుత్‌స్తంభాలు

హాలియాలో రోడ్డుపై కూలిన చెట్టు

జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో కురుస్తున్న వర్షం

నల్లగొండ, ఏప్రిల్ 21: జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దాంతో పలు ప్రాంతాల్లో నష్టం కలిగింది. కొనుగోలు కేంద్రాల్లో పాక్షికంగా ధాన్యం తడిసింది. అత్యధికంగా అనుములలో 6.3 మిల్లీమీటర్ల వర్షం కురవగా తిప్పర్తిలో 5 మి.మీ. గుండ్లపల్లిలో 2.8, చందంపేటలో 2.3, నిడమనూరులో 2.3, నల్లగొండలో 1.8, దామరచర్లలో 1.5, దేవరకొండలో 1.3, తిర్మలగిరి సాగర్‌లో 0.5 మి.మీ వర్షం పడింది.

హాలియాలో గాలివాన బీభత్సం

హాలియా : ఆదివారం సాయంత్రం హాలియాలో గాలివాన బీభత్సం సృష్టించింది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఈదురు గాలులు బలంగా వీయడంతో పలు గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చెట్ల కొమ్మలు విరిగి రోడ్డుపై పడడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. సాయంత్రం నుంచి రాత్రి 9గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

ప్రశాంతంగా టీఎస్ఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష

- 7,405 మంది విద్యార్థుల హాజరు

రామగిరి, ఏప్రిల్ 21 : తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో వచ్చే విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష నల్లగొండ జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని 38 కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. మొత్తం 8890 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 7405 మంది హాజరయ్యారని, 1485 మంది గైర్హాజరయ్యారని డీఈఓ భిక్షపతి తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేసి కేంద్రం అధికారులకు సలహాలు అందించారు.

సివిల్స్‌లో ఇంటర్వ్యూ విధానాన్ని ఎత్తివేయాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్

మిర్యాలగూడ, ఏప్రిల్ 21: కేంద్ర ప్రభుత్వం నిర్వహించే సివిల్స్ పరీక్షల్లో ఇంటర్వ్యూ విధానాన్ని ఎత్తివేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల విడుదలైన సివిల్స్ ఫలితాల్లో అనన్యారెడ్డికి రాత పరీక్షలో 875 మార్కులు రాగా ఇంటర్వ్యూలో 190 వేశారని, దాంతో ఆమె జాతీయస్థాయిలో మూడవ ర్యాంకు సాధించిందని తెలిపారు. అదే బీసీ వర్గానికి చెందిన ఐశ్వర్యం ప్రజాపతి రాత పరీక్షలో 890 మార్కులు రాగా ఇంటర్వ్యూలో కేవలం 154 మార్కులు మాత్రమే వేశారని అన్నారు. బీసీల పట్ల యూపీఎస్సీ పక్షపాత ధోరణి కనబరుస్తుందని ఆరోపించారు. ఇలా ఎంతో మంది ఓబీసీలు రాత పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ కనబరుస్తున్నా ఇంటర్వ్యూలో తక్కువ మార్కులు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట బంటు వెంకటేశ్వర్లు, జానపాటి రవి, శేఖర్, ఈశ్వర్ పాల్గొన్నారు.

రైలు నుంచి కిందపడి వ్యక్తి మృతి

మాడ్గులపల్లి, ఏప్రిల్ 21: కదిలే రైలు నుంచి కిందికి జారిపడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని కుక్కడం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అస్సాం రాష్ట్రం గొలాగట్ జిల్లా రంగోగ్రా మండలం, భకత్ చాప్రి గ్రామానికి చెందిన కిరణ్ మిలి(34) మరో ఐదుగురితో కలిసి పని నిమిత్తం గౌహతి నుంచి సికింద్రాబాద్‌కు రైలులో బయల్దేరారు. రైలు తలుపు వద్ద కూర్చున్న కిరణ్ కుక్కడం, మిర్యాలగూడ స్టేషన్ల మధ్య కిలో మీటర్ నంబర్ 106/8–9 వద్ద రైలు నుంచి కిందపడిపోయాడు. గమనించిన తోటి ప్రయాణికులు వెంటనే చైన్ లాగి రైలును ఆపి రైల్వే అధికారులకు సమాచారం అందించారు. రైల్వే అధికారులు వెళ్లి పరిశీలించగా తీవ్ర గాయాతో కిరణ్ మృతిచెందినట్లు గుర్తించారు. రైల్వే స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ సాలకమ్మ తెలిపారు.

మతోన్మాద బీజేపీని ఓడించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం

మునుగోడు, ఏప్రిల్ 21 : మతోన్మాద రాజకీయాలను పెంచి పోషిస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద సీపీఎం ప్రచార రథాన్ని ప్రారంభించి మాట్లాడారు.

కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు చేసే ప్రయత్నాలను కార్మికులు కర్షకులు తిప్పి కొట్టాలన్నారు. మళ్లీ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే కొట్లాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మిర్యాల భరత్‌కుమార్, నాయకులు యాసరాణి శ్రీను, వేముల లింగస్వామి, యాట యాదయ్య, సాగర్ల మల్లేశ్, వంటెపాక అయోధ్య, యాట రాజు పాల్గొన్నారు.

భక్తాంజనేయ ఆలయంలో హోమం

హోమంలో పాల్గొన్న మాజీ ఎంపీటీసీ రమావత్ భీమానాయక్

మర్రిగూడ : మండలంలోని రాజపేట తండా గ్రామపంచాయతీ పరిధిలో గల పద్మశాలీ కాలనీలో ఉన్న భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా ఆదివారం హోమం నిర్వహించారు. గిరిజన సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ రమావత్ భీమానాయక్–లలిత దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధ్వజస్తంభానికి, ఆంజనేయస్వామి విగ్రహానికి జలాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చెరరుపల్లి ఈశ్వర్, ఆలయ కమిటీ సభ్యులు కోటేశ్, రాజేందర్, జయప్రసాద్, రవి, రాపోలు యాదగిరి, పెద్దయ్య, బిచ్చునాయక్, మారగోని రాము, గోపీనాయక్, అల్వాల్‌రెడ్డి, కర్నాటి శ్రీకాంత్, సుధీర్, శేఖర్, కొండల్, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

హమాలీ కుటుంబానికి చేయూత

కొండయ్య కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందిస్తున్న యువకులు

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 21: ఇటీవల వడదెబ్బతో మృతి చెందిన మండలంలోని చందనపల్లి గ్రామానికి చెందిన హమాలీ కొండయ్య కుటుంబానికి గ్రామ యువత చేయూతనందించారు. రోజు కూలీ చేస్తేనే పూట గడిచే పరిస్థితిలో ఇంటి పెద్ద మృతి చెందడంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. దాంతో గ్రామానికి చెందిన డాక్టర్ రామాచారి , కాశిమల్ల విజయ్ ఆధ్వర్యంలో యువకులు ఆదివారం రూ. 26 వేల నగదు, 25 కిలోల బియ్యాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. కొండయ్య కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని వారు కోరారు.

25 ఏండ్ల తర్వాత కలుసుకున్న దోస్తులు

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

త్రిపురారం, ఏప్రిల్ 21: మండలంలోని పెద్దదేవులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో 1998–99 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. తాము చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. తమకు చదువుచెప్పిన గురువులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, శేఖర్, పూర్వ విద్యార్థులు నర్సయ్య, శ్రీనివాస్, రామకృష్ణ, మాధవి, శ్రీలత, రవి, జలీల్, కమల పాల్గొన్నారు.

బాలాజీనగర్‌లో వైద్య శిబిరం

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 21 : మండలంలోని బాలాజీనగర్‌లో సూర్య ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు గ్రామస్తులను పరిశీలించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

మిర్యాలగూడ రూరల్, ఏప్రిల్ 21 : మండలంలోని అన్నారం గ్రామపంచాయతీ శివారులో ఉన్న గద్దగూడు తండాకు చెందిన ఇస్లావత్ బాలాజీ నాయక్(30) శనివారం కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ ఎస్ఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం బాలాజీ నాయక్ తన ఇంట్లో ఫ్యాన్ కొక్కానికి టవల్‌తో ఉరేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసే సరికి మృతి చెంది ఉన్నాడు. భార్య, బావమరిది, సడ్డకుడి వేధింపులతోనే బాలాజీనాయక్ ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠకు రండి

- ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేకు గ్రామస్తుల ఆహ్వానం

త్రిపురారం, ఏప్రిల్ 21: ఈ నెల 22 నుంచి మూడు రోజుల పాటు మండలంలోని కొణతాలపల్లి గ్రామంలో నిర్వహించనున్న సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమానికి రావాలని మాజీ సర్పంచ్ జొన్నలగడ్డ వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌ను కోరారు. ఆదివారం మండల కేంద్రంలో వారిని కలిసి ఆహ్వానపత్రికను అందించారు. కార్యక్రమంలో నిడమనూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కామెర్ల జానయ్య, నాయకులు అనుముల శ్యాంసుందర్‌రెడ్డి, అనుముల శ్రీనివాస్‌రెడ్డి,

కొనకంచి సత్యనారాయణ, వనజ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మిర్యాలగూడ, ఏప్రిల్ 21: మిర్యాలగూడ టౌన్–2 పరిధిలోని 33కేవీ ఎఫ్‌సీఐ సబ్‌స్టేషన్‌కు కొత్తలైన్ ఏర్పాటు పనులు చేస్తున్నందున సోమవారం సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పట్టణ 1, 2 సెక్షన్ విద్యుత్ ఏఈలు ఎస్.వెంకటేశ్వర్లు, కె.వెంకట్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎఫ్‌సీఐ సబ్‌స్టేషన్‌కింద ఉన్న 11కేవీ ఇండస్ట్రియల్ 1, 2తో పాటు 11కేవీ ఎఫ్‌సీఐ మిర్యాలగూడ ఫీడర్లు, 11కేవీ హనుమాన్‌పేట ఫీడర్లకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. దీంతో పాటు ఇండస్ట్రియల్ 1, 2 ఫీడర్ల కింద ఉన్న ఎఫ్‌సీఐ, ప్రకాశ్‌నగర్, బాపూజీనగర్, హనుమాన్‌పేట, రెడ్డికాలనీ, నాగార్జుననగర్, ముత్తిరెడ్డికుంట, గాయత్రినగర్, అశోక్‌నగర్‌కు కూడా ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వారు తెలిపారు.

వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

- పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల, మున్సిపల్ చైర్మన్ బుర్రి

పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

రామగిరి, ఏప్రిల్ 21 : నల్లగొండ పెద్ద బండ గొల్లగూడలో ఉన్న వీరాంజనేయ స్వామి, మల్లిఖార్జున స్వామి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలి

- కేఎన్ఎం డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ

సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ

మిర్యాలగూడ, ఏప్రిల్ 21: విద్యార్థులు బాగా చదివి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.వెంకటరమణ సూచించారు. ఆదివారం కేఎన్ఎం కళాశాలలో డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లెర్నింగ్ సపోర్ట్ సెంటర్‌లో 2023– 24 డిగ్రీ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు అభ్యాసక పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో చదువుకున్న విద్యార్థులు నేడు ఉత్తమ స్థానాల్లో కొనసాగుతున్నారని అన్నారు. సెంటర్ కోఆర్డినేటర్ ఎన్.కోటయ్య మాట్లాడుతూ అంబేద్కర్ యూనివర్సిటీ న్యాక్ ఏ గ్రేడ్ పొంది ఉన్నత విద్యలో మెరుగైన ఫలితాలను సాధిస్తూ క్యూఆర్ కోడ్ టెక్నాలజీ కలిగిన సర్టిఫికెట్స్ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ ఈ.రాంరెడ్డి, కౌన్సిలర్స్ పి.ప్రభాకర్ రావు, వెంకటేశ్వర్లు, అహ్మద్‌పాషా, లక్ష్మణ్, వెంకన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

భజన పోటీల విజేతకు బహుమతులు

భజన పోటీలో గెలుపొందిన కళాకారులకు బహుమతులు అందిస్తున్న బుసిరెడ్డి పాండురంగారెడ్డి

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 21: మండలంలోని నేతాపురం గ్రామంలో శనివారం రాత్రి బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భజన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ తరపున పేదల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కూనూరు వెంకట్‌రెడ్డి, తిరుమలనాథ ఆలయ చైర్మన్ బుర్రి రాంరెడ్డి, నాయకులు కూన్‌రెడ్డి సంతోష్‌రెడ్డి, గడ్డం సజ్జన్, పాతనబోయిన కోటయ్య, గజ్జల శివానందరెడ్డి, ఇస్రం లింగస్వామి, గజ్జల నాగార్జునరెడ్డి, కళాకారులు పాల్గొన్నారు.

స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

చిట్యాల, ఏప్రిల్ 21 : స్నేహితురాలి కూతురు వివాహానికి ఆమె మిత్రులు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. చిట్యాలకు చెందిన కసిరెడ్డి ప్రభ కూతురు శ్రీజ వివాహం ఆదివారం చిట్యాలలో జరిగింది. ప్రభది పేద కుటుంబం కావడంతో ఆమె చిన్ననాటి స్నేహితులు పెళ్లి ఖర్చుల కోసం ఆర్థిక సాయం చేశారు. చిట్యాల జడ్పీహెచ్ఎస్‌లో ఆమెతో కలిసి చదివిన టెన్త్ బ్యాచ్ విద్యార్థులు(1995–96 బ్యాచ్) రూ.26,500, ఆమెతో ఇంటర్మీడియట్ స్నేహితులు రూ.68,964 అందించారు.

కార్యక్రమంలో మూడ వెంకటాద్రి, అమరోజు దయానంద్, జొర్రిగల జ్యోతి, పెద్దగోని మాధవి, మూడ ఉమారాణి, రూపాక సత్యనారాయణ, జమాండ్ల నర్సిరెడ్డి, భాగ్యమ్మ, గుంటోజు అనంతాచారి, ఎస్. సుజాత పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలు కుటుంబసభ్యులకు అప్పగింత

వృద్ధురాలిని ఆమె కూతురుకు అప్పగిస్తున్న పోలీసులు

మాడ్గులపల్లి, ఏప్రిల్ 21: మండల కేంద్రంలో కొద్ది రోజులుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న వృద్ధురాలిని స్థానికులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. పోలీసులు దర్యాప్తు చేసి సదరు వృద్ధురాలు మిర్యాలగూడ పట్టణంలోని సైదమ్మ తల్లిగా గుర్తించారు. ఆదివారం సైదమ్మను పిలిపించి వృద్ధురాలిని ఆమెకు అప్పగించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జాఫర్, సిబ్బంది ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

చలివేంద్రం వద్ద దాహార్తి తీర్చుకుంటున్న విద్యార్థులు

కట్టంగూర్, ఏప్రిల్ 21 : కట్టంగూర్‌కు చెందిన మాజీ ఉప సర్పంచ్ మిట్టపల్లి బాలనర్సయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నారు. పట్టణంలోని కల్మెర రోడ్డులోని తన ఇంటి ఎదుట 2012లో మినరల్ కూల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. 12 ఏండ్లుగా మండల కేంద్రానికి వచ్చే ప్రయాణికులు, పాఠశాల విద్యార్థుల దాహార్తి తీరుస్తున్నారు. ప్రతి రోజు 30 నుంచి 40 క్యాన్ల వరకు మినరల్ వాటర్‌ను ఉచితంగా అందిస్తున్నారు.

పది మోటర్ల ద్వారా తాగు నీటి విడుదల

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 21 : నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం పుట్టంగండి జీరో పాయింట్ వద్ద నాగార్జునసాగర్ వెనుక జలాల వద్ద ఏర్పాటు చేసిన పది అత్యవసర మోటర్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతుంది. జంటనగరాలకు తాగునీటి ఎద్దడి నివారణ కోసం అత్యవసర మోటర్లను ఏర్పాటు చేశారు. నిన్నటి వరకు తొమ్మిది మోటర్ల ద్వారా నీటి విడుదల కొనసాగగా.. ఆదివారం నుంచి 10 మోటర్ల ద్వారా 900 క్యూసెక్కుల నీటిని కృష్ణా నది నుంచి అప్రోచ్ కెనాల్‌లోకి ఎత్తి పోస్తున్నారు. అత్యవసర మోటర్లను నిరంతరంగా నడిపించి నీటిని ఎత్తిపోయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఏఎమ్మార్పీ ద్వారా రెండు మోటర్ల ద్వారా 800 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. జంటనగరాలకు 525 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.